క్లుప్తంగా

నేడు మోదుకూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మోదుకూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామ సచివాలయం పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శని వారం ఉదయం 7 గంటలకు జరుగుతుందని, మండల పార్టీ అధ్యక్షుడు అన్నపరెడ్డి రాఘురామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని ఆయన తెలిపారు. ప్రజా ప్రతినిధులందరు తప్పకుండా హాజరుకావాలని ఆయన సూచించారు.

సైబర్ నేరస్తులతో అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె: సైబర్ నేరస్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. ప్రముఖ ఆన్‌లైన్ సరీ్వసు సంస్థల పేరుతో ప్రజలకు లక్కీడిప్ తగిలిందంటూ స్పీడ్‌పోస్టుల ద్వారా ఉత్తరాలు పంపుతున్నట్లు సమాచారం తమకు అందిందన్నారు. ఆయా లక్కీడిప్ స్క్రాచ్ కార్డులలో సుమారు రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు నగదు బహుమతిగా గెలుపొందినట్లు ఉంటున్నదన్నారు. నగదును పొందాలంటే ముందుగా కొంత సొమ్మును ట్యాక్స్‌గా జమ చేయాలని చెప్పి, డబ్బులను ప్రజల నుంచి స్వాహా చేస్తున్నట్లు చెప్పారు. ఒకవేళ బహుమతులు వస్తే కంపెనీల వారే నేరుగా తమ ఖాతాదారులకు అందిస్తారన్న అంశాన్ని ప్రజలు గమనించాలని ఎస్‌ఐ వివరించారు. సైబర్‌నేరగాళ్ల ఉచ్చులో పడి మోస పోవద్దని సూచించారు.

20న గద్దర్ సంస్మరణ సభ

తెనాలి: ప్రజాగాయకుడు గద్దర్ సంస్మరణ సభను ఈనెల 20న తెనాలిలో నిర్వహించనున్నారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు అయితానగర్‌లోని పొట్టి శ్రీరాములు కల్యాణ మండపంలో జరిగే సంస్మరణ సభకు న్యాయవాది సంఘాలు, బౌద్ధసంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

సరస్వతీ శిశుమందిర్‌కు బోధన సామగ్రి అందజేత

తెనాలి: పట్టణ సుల్తానాబాద్‌లోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలకు ప్రవాస భారతీయుడు గోరంట్ల వాసుబాబు అందజేసిన రూ.30 వేల విలువైన బోధన అభ్యసన సామాగ్రిని శుక్రవారం ప్రారంభించారు. పాఠశాల అధ్యక్షుడు యలంశెట్టి హనుమంతరావు అధ్యక్షత జరిగిన సమావేశంలో ఏపీ కాటన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గోరంట్ల పున్నయ్యచౌదరి పాల్గొని సామాగ్రిని ఆవిష్కరించారు. తెనాలి మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. బోధన అభ్యసన సామాగ్రి ఆవశ్యకతను చిన్నారులకు వివరించారు. పాఠశాల సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు, చింతమనేని రాజశేఖర్, పేరిరెడ్డి, సమితి సభ్యులు పాల్గొన్నారు. సమితి కార్యదర్శి కోడూరు రమాదేవి స్వాగతం పలుకగా, పాఠశాల కార్యదర్శి దూళ్ల నరసింహారావు వందన సమర్పణ చేశారు.

కేఎస్ఎం స్కూల్‌లో ఎన్‌సీసీ విభాగం ప్రారంభం



తెనాలిఅర్బన్: చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ విభాగాన్ని కౌన్సిలర్ మానసారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవభారత్ నిర్మాణంలో ఎన్‌సీసీ కీలకపాత్ర వహిస్తోందన్నారు. మున్సిపల్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ విభాగాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రాజారెడ్డి, ఎన్‌సీసీ అధికారులు సుబేదార్ మేజర్ మనోజ్, అవతార్ సింగ్, శివానంద్, తాడిబోయిన వెంకట భాస్కరరావు, కె.స్వామి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి కాలువలో పడి మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. డొంకరోడ్డు మూడువంతెనల సమీపంలోని కాలువలో సుమారు 45 సంవత్సరాల వ్యక్తి పడి మృతిచెంది ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గంజాయి వినియోగిస్తున్న వ్యక్తి అరెస్ట్

గుంటూరు ఈస్ట్: గంజాయి తీసుకుంటున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్‌లో ఓ వ్యక్తి గంజాయి తీసుకుంటున్నట్లు సమాచారంతో పోలీసులు శుక్రవారం అక్కడకు చేరుకున్నారు. గంజాయితో ఉన్న రాకేష్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

శ్రావణమాసం మొదటి శుక్రవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గుండి పార్వతీదేవి



గాజుల అలంకరణలో స్వరాజ్యలక్ష్మి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో బూరుగులమ్మ



పెద్దింటమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

భట్టిప్రోలు: శ్రావణ మాసం పురస్కరించుకుని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మొదటి శుక్రవారం కావడంతో భక్తులు తెల్లవారు జామునే అమ్మవార్లను దర్శించుకున్నారు.అమ్మవార్లను వేద బ్రహ్మణులు ప్రత్యేకంగా అలంకరించారు. అలంకారాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భట్టిప్రోలు హిందూ శ్మశాన వాటికలో కొలువైన గుండిపార్వతీ అమ్మవారు, రథం సెంటర్‌లోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో భ్రమరాంబ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా కుంకుమ పూజలు

రేపల్లె: పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రైలుపేటలో ఉన్న శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వరాజ్యలక్ష్మి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, గాజులతో చీరగా అలంకరించారు. మహిళలు ఆలయ ఆవరణంలో కుంకుమ పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తటవర్తి విజయ్, రాధికారాణి పాల్గొన్నారు.

బంగారు తల్లి..బూరుగులమ్మ

రేపల్లె: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గ్రామ దేవత శ్రీ బూరుగులమ్మ ఆలయంలో శుక్రవారం అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, పట్టువస్త్రాలు, పువ్వులతో అమ్మవారిని ప్రత్యేక అలంకరించారు. 108 బంగారు పుష్పాలతో పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పెద్దింటమ్మకు పూజలు

కర్లపాలెం: శ్రావణ శుక్రవారం ఆర్యవైశ్య మహిళలు స్థానిక పెద్దింటమ్మ అమ్మవారికి విశేష పూజలు చేశారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లతో పూజలు చేసి, సారె సమర్పించారు. కుంకుమ పూజ, లలితా సహస్ర నామ పారాయణం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మృతదేహంతో జాతీయ రహదారిపై గ్రామస్తుల ఆందోళన



జాతీయ రహదారిపై మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన

చెరుకుపల్లి: బైకు ఢీకొని చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని జాతీయ రహదారిపై మృతదేహంతో ఆందోళన చేశారు. వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈ ఘటన నడింపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నండింపల్లి ఎస్సీ కాలనికి చెందిన గుమ్మడి నిర్మల(45) ఈ నెల 2న రోడ్డు దాటుతుండగా అదే గ్రామానికి చెందిన ఉప్పాల శశి అనే వ్యక్తి బైక్ పై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఆమె రెండు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించి, వైద్యం అందిస్తున్నారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న నిర్మల శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం ఇంటికి తీసుకువచ్చిన మృతదేహన్ని రోడ్డుపై ఉంచి, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళన చేస్తున్నవారితో మాట్లాడారు. మృతురాలి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రమాదానికి కారకుడైన శశిపై కేసు నమోదు చేసి, అరెస్టు కూడా చేశామని సర్ది చెప్పటంతో ఆందోళన విరమించారు.

స్పందించండి..సారూ..!

పిట్టలవానిపాలెం: ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా సాగునీరందక మండలంలోని ఆరెమండ్ల చానల్ కింది పంట పొలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఆరెమండ్ల చానెల్ కింద సాగవుతున్న భవనంవారిపాలెం, చోడిపాలెం, యాజలి, బోలాయపాలెం గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాలకు పైగా సాగవుతోంది. అయితే కనీసం వరి నారుమడులకు కూడా నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చందోలు వద్ద ఎగువ ప్రాంత రైతులు కాలువ నీరు దిగువ ప్రాంతాలకు రాకుండా అడ్డుకుంటున్నారని దిగువ ప్రాంత రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై సాగునీటి శాఖాధికారులను అనేకసార్లు కలిసి విన్నవించుకున్నా అదిగో ఇదిగో అంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి వరి నారుమడులకు సాగునీరు అందించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

యూనిఫాం పంపిణీ



చెరుకుపల్లి: విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జెడ్పీటీసీ మరివాడ పావని అన్నారు. గుళ్లపల్లి ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులు 41మందికి తన భర్త ప్రసాద్ ఆర్థిక సాయంతో యూనిఫాం దుస్తులను కళాశాల ఆవరణలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, ఎంఈవో టి. నవీన్ కుమార్, హెచ్‌ఎం పి.కవిత, విద్యా కమిటీ చైర్మన్ ఎం.విజయ్ కిషోర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు అభినందనలు



రేపల్లె రూరల్: బాపట్లలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఉత్తమ తహసీల్దారుగా పురస్కారాన్ని అందుకున్న రేపల్లె తహసీల్దారు మల్లికార్జునరావును మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సేవలు అందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మండలి అంజయ్య, జెడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు లోయా బాబూనాంచారయ్య, దారం విజయ్, ఉయ్యూరు శ్రీనివాసరావు, ఎంపీటీసీ మేడికొండ సుధాకర చంద్రహాస రావు, గ్రామాల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి భూముల రీ–సర్వే



భూముల రీ–సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు సాంబశివరావు

గుంటూరు రూరల్: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. జగనన్న భూ రక్ష– శాశ్వత భూ హక్కు కార్యక్రమాన్ని ప్రారంభించారని గుంటూరు పశ్చిమ తహసీల్దారు కె.సాంబశివరావు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భూముల రీ సర్వేను డ్రోన్ ద్వారా పశ్చిమ మండలంలో ప్రారంభించారు. మండలంలోని ఐదు రెవెన్యూ గ్రామాలలోని చిన్న పలకలూరులో చినపలకలూరు జరిగిన కార్యక్రమంలో తహసీల్దారు పాల్గొన్నారు. రెవెన్యూ విభాగంలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు ఈ సర్వేతో పరిష్కారమవుతాయన్నారు. అనంతరం చిన్నపలకలూరు, మల్లవరం గ్రామాలలో 2574.83 ఎకరాలు, పెద్ద పలకలూరు రెవెన్యూ పరిదిలో తోకావారిపాలెం, గొర్లవారిపాలెం గ్రామాల్లో 1422.47 ఎకరాలు, నల్లపాడు రెవెన్యూ పరిధిలో తురకపాలెం గ్రామంలో 447.26 ఎకరాలు, అంకిరెడ్డిపాలెం రెవెన్యూ పరధిలోని వెంగళాయపాలెం, చల్లావారిపాలెం, లాలుపురం గ్రామాల్లో 3933.91 ఎకరాలు, పొత్తూరు రెవెన్యూ పరిధిలో ఓబులునాయుడుపాలెం గ్రామంలో 1462.86 ఎకరాలు, మొత్తం 10341.33 ఎకరాలను డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించినట్లు వెల్లడించారు. మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలో రీ సర్వే జరిగిందన్నారు. అర్బన్ పరిధిలోని నల్లపాడు, పెదపలకలూరు, అంకిరెడ్డిపాలెం, పొత్తూరులో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రీసర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కె.సాంబశివరావు, చిన్నపలకలూరు వీఆర్‌వో పి.ప్రసన్నకుమార్, మల్లవరం గ్రామ వీఆర్‌వో ఎస్.సాగర్, గ్రామ సర్వేయర్ ఐ.విజయరత్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీలో పవర్ గ్రిడ్ ఆపరేషన్స్‌పై సదస్సు




పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ఏపీ ట్రాన్స్‌కో డిప్యూటీ ఈఈ ఎం కిరణ్

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో స్కాడా టూల్, పవర్ గ్రిడ్ ఆపరేషన్స్ అంశంపై అవగాహన సదస్సు జరిగింది. నంబూరు వీవీఐటీలో శుక్రవారం జరిగిన సదస్సుకు ముఖ్య వక్తగా ఏపీ ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.కిరణ్ హాజరయ్యారు. విద్యార్థులకు పవర్ గ్రిడ్ ద్వారా విద్యుత్ సరఫరా పనితీరును ఆయన వివరించారు. అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఏ విధమైన విధానాలు అవలంబించాలో విద్యార్థులకు వివరించారు. సైబర్ ఎటాక్స్‌ను బిగ్‌డేటా ఎనలిటిక్స్, డేటా సైన్స్ వినియోగం ద్వారా నిర్మూలించవచ్చన్నారు. స్కాడా సాఫ్ట్‌వేర్ టూల్ ద్వారా డేటాను సేకరించి, దానిని విశ్లేషించి పవర్ గ్రిడ్ స్థిరత్వాన్ని అదుపు చేయవచ్చని వివరించారు. ముందుగా ఐఈఐ విద్యార్థి విభాగం ప్రచురించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ దర్శనం

రూ.2లక్షల విలువ చేసే నోట్లతో అలంకరణ



చేబ్రోలు: పొన్నూరు పట్టణం గుంటూరు రోడ్డులోని కనకదుర్గమ్మ అమ్మవారికి శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రదాన అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. రూ.500లు, రూ.200, రూ.100, రూ.50, రూ.20, రూ.10 నోట్లు.. సుమారు రూ.రెండు లక్షల నగదుతో అలంకరించారు. సహస్రనామ కుంకుమార్చన, భజన కార్యక్రమాలు జరిగాయి.

డీఎస్సీ ఉచిత డెమో క్లాసులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం త్వరలో విడుదల కానున్న డీఎస్సీకి సన్నద్ధమవుతున్న బీఈడీ, డీఎడ్ విద్యార్థుల ప్రయోజనార్థం ఉచిత డెమో తరగతులను నిర్వహించనున్నట్లు విజయసాధన స్టడీ సర్కిల్ డైరెక్టర్ గంగా కిషోర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20, 21, 22వ తేదీల్లో బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో అధ్యాపకులతో ఉచిత డెమో తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 0863- 2240433, 9293177737 సంప్రదించాలని సూచించారు.

పట్టణంలో వీధి కుక్కల పట్టివేత



సాక్షి ఎఫెక్ట్

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని వీధి కుక్కలను పట్టుకునేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో వీధి కుక్కల స్వైరవిహారం అనే కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. శుక్రవారం మారీసుపేటలో రోడ్లపై తిరుగుతున్న వీధి కుక్కలను పట్టుకుని బుర్రిపాలెం రోడ్డు కంపోస్టు యార్డులోని కుక్కల శస్త్ర చికిత్సాలయంకు తరలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అంతరిక్ష నిపుణురాలితో ఐలవరం విద్యార్థులు..



ప్రముఖ స్పేస్ నిపుణురాలు జానెట్ ఐవీతో సంభాషిస్తున్న ఐలవరం విద్యార్థిని

ఐలవరం(భట్టిప్రోలు): అమెరికాలోని టెన్నిసీ రాష్ట్రానికి చెందిన జానెట్ ఐవీ శుక్రవారం ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆన్‌లైన్‌లో సంభాషించారు. ఈమె సూర్య గ్రహానికి, సౌర కుటుంబానికి చెందిన నిపుణురాలు. యూఎస్ఏలోని సీఎస్ఎస్ న్యూస్ చానల్‌లో తరచుగా ఇంటర్వ్యూలు ఇస్తుంటారు. ఐలవరం విద్యార్థులు అడిగిన అతి క్లిష్టమైన ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. ఈ విశ్వం ఎక్కడ అంతం అవుతుంది? ఒక గ్రహం నుంచి మరొక గ్రహానికి వెళ్లడానికి 2 గంటల పట్టే స్పేస్ షటిల్ డిజైన్ ఏలా చేస్తారు, స్పేస్‌కి సంబంధించిన ఉద్యోగ అవకాశాలు, సూర్య గ్రహంపై పలు ప్రశ్నలు అడిగారు. రెండు గంటల పాటు ఏకధాటిగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఆమె ప్రస్తుతం నేషనల్ స్పేస్ సొసైటీ గవర్నర్‌గా కొనసాగుతున్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా దుగ్గిరాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు కూడా ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు కూడా జానెట్ సమాధానాలు ఇచ్చారు. ఐలవరం ఆంగ్ల ఉపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణ జానెట్‌తో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా అభ్యర్థించగా అంగీకరించారు. ఆయన ఇప్పటికే స్పేస్ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులలో ఆయన సైన్స్ పట్ల అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు. హరికృష్ణను హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాచర్ల మోహనరావు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడంలో ఐలవరం ఉన్నత పాఠశాల ప్రత్యేకతను సంతరించుకుంది.

నేడు పంచాయతీల్లో మినీ పోరు

పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి



కొల్లూరులో ఎన్నికల నిర్వహణ సామగ్రితో సిబ్బంది

కర్లపాలెం: బుద్ధాం గ్రామ పంచాయతీలోని 6వ వార్డు శనివారం ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కర్లపాలెం ఎంపీడీవో, డీపీవో దాసరి రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడ వార్డు మెంబరుగా పని చేస్తున్న మిద్దిబోయిన అగ్గిరాముడు అనారోగ్యంతో మృతిచెందటంతో ఉప ఎన్నిక జరుగుతుందని తెలిపారు. ఉప ఎన్నికలలో మిద్దిబోయిన శ్రీనివాసరావు, నర్రా వెంకటేశ్వర్లు పోటీ చేస్తున్నారని చెప్పారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. 6వ వార్డులో మహిళలు 73, పురుషులు 73మంది మొత్తం 146మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఆయన చెప్పారు. శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు ఎన్నిక జరుగుతుందని 2గంటల నుంచి ఓట్లు లెక్కించి గెలుపొందిన వారి పేరు ప్రకటిస్తామని చెప్పారు.

- రేపల్లె రూరల్ పరిధిలోని బేతపూడి పంచాయతీ 7వ వార్డుకు ఉప ఎన్నిక జరగనుందని ఎంపీడీవో శివపార్వతి తెలిపారు. బేతపూడిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. చాట్రగడ్డ, రాజుకాల్వ, బేతపూడి పంచాయతీ పరిధిలోని ఖాళీ అయిన వార్డులలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటికే చాట్రగడ్డ, రాజుకాల్వ పంచాయతీలలోని వార్డులలో ఒక్కొక్క నామినేషన్ రావటంతో ఎన్నిక ఏకగ్రీవమైందన్నారు. బేతపూడి 7వ వార్డుకు రెండు నామిషన్‌లు అందటంతో ఎన్నిక అనివార్యమైందన్నారు. అమర్తలూరి సుజ్ఞానం, డి.మార్తకుమారిలు పోటీలో ఉన్నారని చెప్పారు.
- కొల్లూరు మండలంలోని రెండు పంచాయతీలలో జరగనున్న రెండు వార్డు సభ్యుల ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావు తెలిపారు. దోనేపూడి 5వ వార్డులో 285 ఓట్లు ఉండగా, వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడు వెనిగళ్ల శ్రీనివాసరావు, టీడీపీ సానుభూతి పరడు కొల్లూరు శ్రీనివాసరావు పోటీ పడుతుండగా ఆర్ఓగా ఎన్. ఏసయ్య వ్యవహరించనున్నారు. చిలుమూరు 4వ వార్డులో 174 ఓట్లు ఉండగా ఆర్ఓగా సేవానాయక్ వ్యవహరించనున్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతి పరురాడు కాసాని శివకుమారి, టీడీపీ సానుభూతి పరుడు ఇంద్రా శివయ్య పోటీలో ఉన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలలో 144వ సెక్షన్ అమలులో ఉందని కొల్లూరు ఎస్ఐ జి. రాజ్యలక్ష్మి తెలిపారు.
- వేమూరు నియోజకవర్గంలో చుండూరు మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లు ఉప ఎన్నికకు ఏర్పాట్లు సిద్ధం చేశామని ఎంపీడీవో సుగుణమ్మ తెలిపారు. మున్నంగివారిపాలెం గ్రామ సర్పంచ్, అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామ పంచాయతీలోని 2, 4 వార్డులు, వేమూరు మండలంలోని వరహాపురం గ్రామ పంచాయతీ 10వ వార్డుకు ఉప ఎన్నిక జరగనుందని ఆమె తెలిపారు.
- నగరం మండలంలో మూడు పంచాయతీలలో మూడు వార్డులకు ఉప ఎన్నికలు జరుగుతున్నట్లు ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ తెలిపారు. ధూళిపూడిలోని 6వ వార్డు, చెల్లంవారిపాలెంలోని 6వ వార్డు, చినమట్లపూడిలోని 3వ వార్డుకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ధూళిపూడి 6వ వార్డుకు ఎం.ఉషారాణి, బెల్లంవారిపాలెం 6వ వార్డుకు పి.విజయ్ బాబు ఒకరే నామినేషన్ వేయడంతో ఆ వార్డులు ఏకగ్రీవమైనట్లు తెలిపారు.చి నమట్ల పూడిలోని 3వ వార్డుకు షేక్ నరుద్దీన్, షేక్ బాజీ రెండు నామినేషన్లు రావడంతో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన



ఎమ్మెల్యే రోశయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

చేబ్రోలు: పొన్నూరు పట్టణంలోని జీబీసీ రహదారి విస్తరణ పనులను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య శుక్రవారం పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం సాక్షి భావనారాయణ స్వామి దేవస్థానం నుంచి కూరగాయల మార్కెట్ వరకు రహదారి విస్తరణకు మేరకు భవనాలను యంత్రాల సహాయంతో తొలగించారు. ప్రస్తుతం శిథిలాల తొలగింపు పనులు జరుగుతున్నాయి. పూర్తి అయిన వెంటనే పనులు చేపట్టనున్నారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కృషి, పట్టుదలతో అనేక అవాంతరాలను ఎదుర్కొని రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను ప్రారంభించారు. రహదారి నిర్మాణ పనులు త్వరతగతిన చేపట్టి పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే కిలారి అధికారులకు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఎమ్మెల్యే కిలారికి బార్ అసోసియేషన్ సభ్యుల వినతి

పొన్నూరు కోర్టు భవనానికి మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా తాత్కాలిక సౌకర్యాల ఏర్పాటు కోసం పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని న్యాయవాదులు, పొన్నూరు బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను తెలియజేశారు. కోర్టు భవనంగా రోటరీ క్లబ్‌ను ఇప్పించవలసిందిగా కోరారు. దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. బార్ అసోసియేషన్ సభ్యులు వర్ధన్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు నాగరాజు, నాగిశెట్టి శ్రీనివాసరావు, బొనిగల రాజారావు, పొందుగల చైతన్య, జయరాజు, విటల్ ప్రసాద్, అంకమ్మ రావు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

ప్రత్తిపాడు: అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. దీప్తి మనోజ ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ పోరు యాత్ర శుక్రవారం సాయంత్రం ప్రత్తిపాడుకు చేరింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో దీప్తి మనోజ అంగన్‌వాడీలతో మాట్లాడారు. అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. ఏపీలో అంగన్‌వాడీ ఉద్యోగులకు తెలంగాణ కన్నా అదనంగా జీతాలు చెల్లించాలన్నారు. 2017 నుంచి పెండింగ్లో ఉన్న టీఏ బిల్లులు చెల్లించాలని కోరారు. యూనియన్ గుంటూరు జిల్లా గౌరవాధ్యక్షుడు వై.నేతాజీ మాట్లాడుతూ అంగనవాడీ వర్కర్స్ ఐకమత్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ప్రత్తిపాడు ప్రాజెక్టు కార్యదర్శి కె.పద్మ మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటం వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులకు స్పూర్తిదాయకంగా ఉందని అన్నారు. యూనియన్ ప్రత్తిపాడు ప్రాజెక్టు కోశాధికారి నగరాజకుమారి, కమల జ్యోతి, పాల్గొన్నారు.